ఊహించని విధంగా సిటీలో అనుకున్న పని జరిగిపోవడంతో అదేరోజు ప్రయాణానికి రెడీ అయ్యాను. వేగంగా పని ముగిసినందుకు ఆనం

# దెయ్యం

- డి.శ్రీనివాసరావు

దంగా ఉన్నప్పటికీ, చలిలో మోటార్‌బైక్ మీద ప్రయాణం కాస్త ఇబ్బందికరంగా వుంది.

ఊరి పొలిమేరలు చేరుకున్నాను. చలి ఎక్కువయ్యే సరికి ఇక ఆగలేక, బైక్ ఆపి ఓ సిగరెట్ వెలిగించాను. గుండెల నిండా పొగ పీల్చేసరికి వెచ్చగా, హాయిగా అనిపించింది. గేర్ మార్చి మోటార్‌సైకిల్‌ని ముందుకు దూకించాను. నా ప్రయాణం పదినిము షాలు కూడ సాగలేదు. కనుచూపు దూరంలో కన్పించిందో అమ్మాయి. సమీపిస్తున్నకొద్దీ ఆమె నాజూకుతనం, అందం నన్ను ఆకర్షించాయి. తెల్లని పంజాబీ డ్రెస్‌లో ఆమె అందం ద్విగుణీకృతమైంది. చేయి చాస్తూ ఆమె లిఫ్ట్ అడిగేసరికి, సడన్‌బ్రేక్ వేసి బైక్ ఆపాను.

''మీరు... స్రవంతి వాళ్ళ కజిన్ కదూ!'' అంది, పరిచయం వున్నదానిలా. ఆమె ఎవరో నాకు తెలియదు. ఎవరో తెలుసుకోవాలనే ప్రయత్నం నేను చెయ్యలేదు. చెబితే ఆమే చెబుతుందని వూరుకున్నాను.

''ఊర్లో కాస్త అర్జంట్ పని ఉంది. గంట నుండి వెయిట్ చేస్తున్నాను. బస్సులు రాలేదు. ఇప్పుడే తెలిసింది, నక్సలైట్ల బంద్‌వల్ల బస్సులు రద్దుచేసారని'' అంది లిఫ్ట్ కావాలి అన్నట్టు.

అంగీకారంగా నేను తలవూపగానే, నా వెనుక కూర్చుంది.

చలి తన ఉనికిని చాటుకుంటోంది. ఆ అమ్మాయి మౌనంగా కూర్చుంది. నేనే చనువు తీసుకుని వివరాలు అడగడంతో ''నాపేరు రాగిణి. మీ స్రవంతి మాకు సీనియరండీ. నేను మీ ఊరు విడిచిపెట్టి చాలా కాలమైంది. ఇప్పుడు మీ ఊరిలోనే వున్న మా ఆంటీ వాళ్ళ ఇంటికి వెళుతున్నాను'' అంటూ వివరాలు చెప్పింది.

పూర్తిగా చీకటి పడింది. అమ్మాయి లిఫ్ట్ అడగడం అదృష్టంగా భావించినప్పటికీ మా ఇద్దరి మధ్యా ఉన్న బ్రీఫ్‌కేస్ చైనా వాల్‌లాగ తోచింది. తుంటరి కోరికలు నాపై దాడి చేస్తున్నప్పటికీ విజ్ఞత ముందు తలవంచాయ్. మలుపు వద్ద గోతులు ఎదురవడంతో సడన్ బ్రేక్ వేశాను. కంగారుపడిన ఆమె చెయ్యి నామెడను చుట్టేసింది. తియ్యని అనుభూతి అనుభవంలోకి వచ్చింది. ఆమె సారీ చెప్పడంతో, పర్వాలేదన్నాను.

మెడమీద మండుతున్నట్లన్పించడంతో నెమ్మదిగా తాకి చూశాను. చల్లగా తగిలింది రక్తం! ''మీకు గోళ్ళున్నాయండీ!'' అనడంతో కాస్త ముందుకు వంగి వేళ్ళు చూపించింది. వెన్నెల వెలుగులో ఆమె గోళ్ళు కత్తుల్లా మెరిసాయ్!

రాగిణి వాళ్ళ కాలనీ వచ్చింది. ఇంటి దగ్గర డ్రాప్ చేస్తానన్నాను. ''చాలా థాంక్సండీ'' అని చెప్పి



సెలవు తీసుకుంది.

• • •

ఆరోజు రాగిణి తమ ఇంటికి రమ్మని అడ్రస్ ఇచ్చి ఆహ్వానించడంతో ఆదివారంకోసం ఎదురు చూసాను. ఆదివారం ఉదయం వీలు కుదరకపోవడంతో సాయంత్రం బయలుదేరాను. కాలనీ దగ్గరికి చేరేసరికి కరెంటు పోయింది.

రాగిణి చెప్పిన అడ్రస్ ప్రకారం ఓ ఇంటిని సమీపించాను. తలుపు కొట్టాను. టార్చ్‌లైట్ పట్టుకొన్న ఓ ముసలావిడ తలుపు తెరిచింది. ''ఎవరు కావాలి?'' అనడిగింది.

''రాగిణీగారున్నారాండీ'' అనడంతో ''అదేంటి బాబూ అలా అడుగుతున్నావ్? మా రాగిణి చనిపోయి సంవత్సరం పైగా అయింది కదా!'' అనడంతో నా గుండె ఝల్లుమంది. కళ్ళ ముందు రాగిణి రూపం కనపడి, కళ్ళు గిర్రున తిరిగాయ్.

• • •

జరిగిందంతా నా మిత్రుడు రాఘవకి చెప్పాను. అంతా విని వాడు పడిపడి నవ్వాడు. అర్థంకాక అయోమయంగా చూశాను.

''గోపీ.. నీవెళ్లిన కాలనీ కరెక్టే. కాకపోతే ఇల్లు తారుమారు అయ్యింది. 'రాగిణి' అన్నామె ఓ బ్యాంక్ ఆఫీసర్ భార్య. పోయిన సంవత్సరం చనిపోయింది. నువ్వు మాట్లాడిన ముసలావిడ చనిపోయిన రాగిణి అత్తగారు. నువ్వు బైక్ ఎక్కించుకున్న రాగిణి నిక్షేపంగా వుంది. చనిపోయినావిడ పేరు, నీవు లిఫ్ట్ ఇచ్చిన అమ్మాయిపేరు ఒకటే కావడంతో ఈ సమస్య వచ్చింది. అదీకాక కొత్తగా మార్చబడ్డ డోర్ నెంబర్లు వల్ల నీవు పొరపడ్డావు. నేను ఆ వీధిలో వుండటంవల్ల ఇదంతా తెలిసింది. నీ మనసులోంచి దెయ్యాల భయం తీసేయ్'' అని వాడు చెప్పేసరికి, నాకు సిగ్గనిపించింది. ★